కూడా తెలంగాణకు సమ్మతమే అని ఒప్పించగలిగారు. ఇదే చతురత 2009 ఎన్నికల్లో టీడీపీతో పొత్తుకు దారితీసింది. అయితే, పొత్తు ధర్మాన్ని పాటించని టీడీపీ రెబెల్స్‌ను రంగంలోకి దించడంతో టీఆర్‌ఎస్ తీవ్రంగా నష్టపోయింది. తెలంగాణ ఆకాంక్ష గాల్లో దీపంలా మారింది. ఆ సమయంలోనూ కేసీఆర్ చలించలేదు. వాలుకు కొట్టుకుపోయే రకం కాదు. ఎదురీత ఆయన సహజ స్వభావం. పడిన కెరటం ఉవ్వెత్తున ఎగిసిపడటానికి ఒక్క అంశం చాలు! తెలంగాణ బిడ్డలకు అన్యాయం చేస్తూ సర్కార్ తీసుకొచ్చిన 14ఎఫ్‌ను చివరి అస్త్రంగా ఎంచుకున్నారు. ఈసారి 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' ఇదీ నినాదం. నిరాహార దీక్షతో ఉద్యమాన్ని పునరుత్థానం చేశారు. 'తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైంద'న్న ప్రకటన సాధించేంత వరకు పచ్చి గంగ ముట్టుకోలేదు. ఉద్యమబాటలోకి వచ్చినప్పుడు 'పార్లమెంటరీ విధానంలోనే తెలంగాణ సాధిస్తాన'న్న ఆయన మాట అక్షర సత్యమైంది. కేంద్ర ప్రభుత్వం మళ్లీ వెనక్కి తగ్గడం, ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటం, చివరికి కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించేంత వరకు కేసీఆర్ గిరిగీసి బరిలో నిలబడ్డారు. ఆయన బలంగా నమ్మినట్టు ఆ సమయంలో తెలంగాణ అంతా ఒక్కటైంది. తెలంగాణ సమాజం ఆయన వెంట నిలిచింది. ఆయన చెప్పినట్టు విన్నది. ఆయన చేయమన్నట్టు చేసింది.



***

2014లో రాష్ట్రం ఏర్పాటైంది.. 'ఖేల్ ఖతం.. టీఆర్‌ఎస్ బంద్' అనుకున్నారంతా! తెలంగాణ ప్రకటించిన తర్వాత టీఆర్‌ఎస్ అవసరమేందని ప్రశ్న! ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ నిర్ణయమూ తెలంగాణ కోసమే! కేసీఆర్‌కు తెలంగాణ సాధించిన ఘనత చాలు! ప్రత్యేక రాష్ట్రాన్ని అన్నిటా ప్రత్యేకంగా నిలపాలంటే ప్రజా ప్రభుత్వమే అధికారంలోకి రావాలనుకున్నారు. కేసీఆర్‌ను ప్రజలు బలంగా నమ్మారు. వరుసగా రెండుసార్లు ముఖ్యమంత్రిని చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. అన్నింటా తెలంగాణను అగ్రపథంలో నిలిపారు. మూడోసారి ఎన్నికల ఫలితం అనుకూలంగా రాకపోవచ్చు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా లేకపోవచ్చు. కానీ, తెలంగాణ కోసం నడుం బిగించాల్సి వస్తే.. మొదటి వ్యక్తి ఆయనే అవుతారన్నది సత్యం. తెలంగాణకు అన్యాయం జరిగితే నిలదీసే మొదటి గొంతుక ఆయనదే అవుతుందన్నది శిలాక్షరం.



## ప్రచారాలు పట్టని మనిషి

తన 70 ఏండ్ల జీవనంలో.. కేసీఆర్ ముప్పయ్ ఏండ్లు తెలంగాణ చుట్టూ పరిభ్రమిస్తూ వచ్చారు. ఉద్యమానికి ఊపిరిలూదటానికి తన ఉసురు మీదికి తెచ్చుకున్నారు. సమయోచిత నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన శైలి విభిన్నం. పాత తరం అనుభవాలనూ పరిగణనలోకి తీసుకుంటారు. కొత్త తరం ఆలోచనలనూ గౌరవిస్తారు. ప్రచార ఆర్భాటం పెద్దగా గిట్టని మనిషి. 'నా పని కనిపిస్తుంది.. నేను కనిపించకపోతేనేం' అనుకుంటారు! ఆయనలోని విశాల భావాలే కేసీఆర్‌ను ప్రజల మనిషిగా నిలబెట్టాయి. ఉద్యమానికి తానే చుక్కాని అయినా... తన వెంట నడిచిన వారందరినీ యోధులుగానే భావించేవారు. 'జై తెలంగాణ' అని నినదించిన ప్రతి మనిషినీ గుండెలకు హత్తుకున్నారు. ఉద్యమ సమయంలో వరంగల్‌లో జరిగిన భారీ సభకు దాదాపు 25 లక్షల మంది హాజరయ్యారు. అంతటి మహాసభలో జేఏసీ కన్వీనర్ కోదండరాంను చూపిస్తూ 'ఆయన శాసిస్తాడు.. మనం పాటిద్దాం' అని ప్రకటించారు. ఎంతో విశాలత్వం ఉంటే తప్ప ఒక రాజకీయ నాయకుడు ఈ మాట చెప్పలేరు! తను నిర్మించిన ఉద్యమం, తను నిర్వహిస్తున్న సభ.. అందులో ఒకానొక ప్రొఫెసర్‌కు పట్టం కట్టడం కేసీఆర్‌కే చెల్లింది. మిలియన్ మార్చ్ సందర్భంలో.. కోదండరాం వచ్చే వరకూ ఆగి, ఆయన వచ్చాకే ప్రతిజ్ఞ చేయించడం కేసీఆర్ ఉదారతకు చిన్న ఉదాహరణ మాత్రమే! ఇంత విశాలమైన మనిషికి ఫార్మాలిటీస్ అంటే అంతగా గిట్టదు. ఫొటోలకు పోజులివ్వడం, పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడం పెద్దగా నచ్చదు. కార్యకర్తలు, అభిమానులు నొచ్చుకుంటారని తప్పక కొన్నిసార్లు మినహాయిస్తారు.

**ఇదీ.. కాలం కాచి**
**వడబోసిన నాయకుడి కథ.**
**కాలాన్ని కాచి వడబోసిన యోధుడి గాథ.**
**ఓ యాభై ఏండ్ల తర్వాత, అప్పటి తరం**
**కేసీఆర్‌ను కాల్పనిక పాత్ర అనుకున్నా...**
**ఆశ్చర్యపోనవసరం లేదు!**
**ఎందుకంటే...**
**ఆయన అలా ఉండటం ఆయనకే సాధ్యం.**
**ఆయనలా ఉండటం మరొకరికి అసాధ్యం.**
**క్లుప్తంగా చెప్పాలంటే కేసీఆర్...**
**ఉద్యమకారులకు ఊతం. లీడర్లకు పాఠం.**
**అసలైన సంక్షేమానికి నిర్వచనం. సిసలైన**
**అభివృద్ధికి సాక్ష్యం. ప్రబంధ కావ్య భాషలో**
**చెప్పాలంటే కేసీఆర్.. అభినవ రాజర్షి.**
**సినీ పరిభాషలో చెప్పాలంటే**
**ఆయన మగాడ్రా బుజ్జీ!**

... దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ